తెలంగాణభవన్‌లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు పోచారం, వేముల, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పార్టీ నేతలు నాగం, శ్రీనివాస్‌గౌడ్, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తదితరులు

గొంతువిప్పేది బీఆర్‌ఎస్సే

- పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తేనే సమస్యలకు పరిష్కారం
- కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీల అమలు
- మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ గెలిచింది
- గతంలో దావోస్‌కు వెళ్లడం దండగన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడేమంటారు?
- నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో, గల్లీలో ఎవరున్నా తెలంగాణ గొంతు విని పించే బీఆర్‌ఎస్ ఎంపీలే పార్లమెంట్‌లో ఉండాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. వచ్చే పార్ల మెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే వారిచ్చిన హామీలు నెరవేరుతాయని తెలిపారు. ఢిల్లీ నుంచి తెలంగాణకు ఏం తీసుకురావాలన్నా అది బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 100 రోజులు కాలేదని, అందుకనే ఆగుతున్నామని, లేదంటే చీల్చిచెండాడేవాళ్లమని హెచ్చరించారు. మరికొన్ని రోజులు పోతే బీఆర్‌ఎస్ నేతలు ఇంట్లో కూర్చున్నా రండి రండి అంటూ ప్రజలే వారిని బయటకు తీసుకువస్తారని పేర్కొన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇకపై కార్యకర్తల అభిప్రాయం ప్రకారం పార్టీ నడుచుకుంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రం కోసం రేయింబవళ్లు తండ్లాడామని, అయినా అసెంబ్లీ ఎన్నికల్లో తడబడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉంటూనే మన మట్టిమనుషుల ఆకాంక్షల కోసం ఊపిరి ఉన్నంత వరకు పోరాడదామని పిలుపునిచ్చారు.

బడ్జెట్‌కు మించి హామీలు

దేశంలో ప్రభుత్వాలు మారడం కొత్తేమీ కాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేండ్లు పాలించిన సందర్భాలు చాలా అరుదని, ఐదేండ్లకే ఆ పార్టీ ప్రజావ్యతిరేకత మూటగట్టుకుని ఇంటికిపోయిన సందర్భాలే ఎక్కువని వివరించారు. మన బడ్జెట్ రూ. 2.90 లక్షల కోట్లు అయితే, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు మూడున్నర లక్షల కోట్ల రూపాయలు కావాలని తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. హామీల సంగతి తేల్చమంటే అవసరం లేని విషయాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీల అమలుకు డబ్బుల్లేవని స్వయంగా ఆ రాష్ట్ర ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా తెలంగాణను అభివృద్ధి చేశారని, సంప్రదాయ రాజకీయ పద్ధతులకు ఆయన దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఫలితాలను గుణపాఠంగా తీసుకుని ముందుకు సాగుదామని, పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు.

మెడలు వంచాల్సింది పోయి దండలేస్తున్నారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని చేతులెత్తేసిన కేంద్రం మెడలు వంచాల్సింది పోయి కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ప్రతిరోజు బీజేపీ నాయకుల మెడల్లో దండలేసి వస్తున్నారని విమర్శించారు. పేదరికం అతితక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మూడోస్థానంలో ఉండడం కేసీఆర్ ఘనతేనని ప్రశంసించారు. రాష్ట్రంలో పేదరికం 3 శాతంగా ఉంటే, ప్రధాని మోదీ సొంతరాష్ట్రం గుజరాత్‌లో 9శాతంగా ఉందని గుర్తు చేశారు. దావోస్ వెళ్లడం దండగని ప్రతిపక్షంలో ఉండగా విమర్శించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ హత్యా రాజకీయాలు మొదలు పెట్టిందని హరీశ్ ఆరోపించారు.

కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి రక్ష: పోచారం

కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి రక్ష అని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఓడిపోతారన్న ప్రచారం జరిగిందని, కానీ తాను కష్టపడి పనిచేసి తప్పని నిరూపించానని చెప్పారు. ఓటమితో కుంగిపోవద్దని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ హామీలపై పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ రాములు, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రజనీ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారంతోనే కాంగ్రెస్ గెలిచింది: నాగం జనార్దన్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారంతోనే గెలిచిందని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని బీఆర్‌ఎస్‌లో చేరే వరకు తాను అనుకునేవాడినని, కానీ కేసీఆర్ ప్రభుత్వం 6 లక్షల తెల్లరేషన్‌కార్డులు ఇచ్చిందనే విషయం ఆ తర్వాత తెలిసిందని పేర్కొన్నారు. ఈ విషయాలను ప్రచారం చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాడర్ అధైర్యపడొద్దని, పార్లమెంటు ఎన్నికల్లో అందరం సమిష్టిగా కష్టపడితే 10 స్థానాలు గెలుచుకోవచ్చని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ ఎంపీలతోనే తెలంగాణకు ప్రయోజనం

ఎక్స్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవటానికి బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 2014లో రాష్ట్రం సాధించినప్పుడు తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుక టీఆర్‌ఎస్ అని, 2024లో కూడా తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుక బీఆర్‌ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. నాడు, నేడు, ఏనాడైన తెలంగాణ గళం, తెలంగాణ బలం, తెలంగాణ దళం బీఆర్‌ఎస్సే నంటూ ఎక్స్‌లో వెల్లడించారు. 16, 17వ లోక్‌సభ లెక్కల ప్రకారం బీఆర్‌ఎస్ ఎంపీలు తెలంగాణ ప్రయోజనాలు, హక్కుల గురించి అడిగిన ప్రశ్నలే ఇందుకు నిదర్శనమని వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ బృందానికి ఎందుకు ఓటు వెయ్యాలో ఈ లెక్కలే స్పష్టం చేస్తాయని పేర్కొన్నారు.

బండీ.. నోటి దురుసు మానుకో

- కాంగ్రెస్ సర్కారును కూల్చే ఉద్దేశం బీఆర్‌ఎస్‌కు లేదు
- 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేయాలి
- మీడియాతో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

ఇల్లంతకుంట/రాజన్న సిరిసిల్ల, జనవరి 17 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ సర్కారును కూల్చే ఉద్దేశం బీఆర్‌ఎస్‌కు లేదు. కానీ.. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మా పార్టీని అడ్డంపెట్టుకొని దిగజారుడు రాజకీయం చేస్తున్నడు. ఆయన నోటి దురుసు మానుకోవాలి' అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ చెప్పారు. అబద్ధపు హామీలిచ్చే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బలమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం సాగుకు 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమైందని, కాళేశ్వరం నీటిని ఇవ్వబోమని చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని తప్పించుకున్నదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తామని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఇప్పుడు నిధుల్లేవని చెప్తున్నదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరును గమనిస్తున్నారని, బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అనంతరం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల బకాయిలు రూ.250 కోట్లు వెంటనే విడుదల చేయాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం నేతన్నల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత, మరమగ్గాల కార్మికులకు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. లెక్క పక్కాగా ఉండేలా ప్రతీ మరమగ్గానికి జియోట్యాగింగ్ చేసి, ప్రతి కార్మికుడికి రైతు మాదిరిగా రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. నేతన్నల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని 50 ఏండ్లకే ఆసరా పింఛను ఇచ్చినట్టు చెప్పారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు, కరెంట్ ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి...

ఇస్తామని చెప్పారని, కాబట్టి ఇస్తరా? ఇవ్వరా? స్పష్టంగా చెప్పాలని నిలదీశారు. నీళ్లు, పెట్టుబడి విషయంలో ప్రభుత్వం తీరిగ్గా స్పందిస్తే వ్యవసాయం ఆగదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే రైతులకు విశ్వాసం కల్పించలేకపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు క్యూలో నిల్చోబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి పెట్టుబడులు తీసుకురావడం కంటే రాజకీయాల గురించే ఎక్కువ మాట్లాడుతున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు.

లోకం పోకడ

అప్పటికి కూడా పేదరికం పోతుందో లేదో తెలియదు గానీ, మనం మాత్రం పోతాం!

గ్రేటర్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఫలితంగా అప్పుడే ఉక్కపోత మొదలైంది. రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో కొంత చలిగా ఉన్నప్పటికీ పగటి వేళ మాత్రం ఎండలు దంచి కొడుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 30.8 డిగ్రీలుగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.7 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 44 శాతంగా ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	13.1°c	34.3°c
ఆదిలాబాద్	14.0°c	34.2°c
వరంగల్	17.0°c	30.0°c
మెదక్	17.6°c	33.3°c
ఖమ్మం	18.0°c	30.0°c
నల్లగొండ	18.0°c	34.1°c
కరీంనగర్	18.0°c	32.0°c
హైదరాబాద్	19.7°c	30.8°c
మహబూబ్‌నగర్	19.7°c	31.0°c
నిజామాబాద్	20.4°c	31.2°c

80 వేల మంది అసహాయుల ఆక్రందన

మొదటిపేజీ తరువాయి...

లక్షల మంది లబ్ధిపొందారు. సీఎంఆర్‌ఎఫ్ ఫైళ్లను ప్రతి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధి స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో అందజేసేవారు. అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సీఎంఆర్‌ఎఫ్ కింద సహాయం కోసం వచ్చేవారి దరఖాస్తులను నింపించటం, వాటిని ఫాలోఅప్ చేయించేందుకు ప్రత్యేకంగా తమ కార్యాలయాల్లో ఒక మనిషిని ఏర్పాటు చేసేవారు. సెక్రటేరియట్‌లో సైతం ప్రత్యేకంగా ఒక ఫ్లోర్‌లో ప్రజాప్రతినిధుల నుంచి, నేరుగా సీఎం కార్యాలయానికి వచ్చే దరఖాస్తులను భద్రపరిచేందుకు, బిల్లుల తనిఖీ, చెక్కుల జారీ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. వ్యవస్థ మొత్తం పకడ్బందీగా ఉండేది. దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచి రెండు నెలలలోపే చెక్కులను ఇంటికి పోస్టు ద్వారా పంపించేవారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారా అర్జీ పెట్టుకొంటే చెక్కును ఎమ్మెల్యే ద్వారా పంపించేవారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పేరుతో ఒక లేఖను కూడా జత చేసేవారు. అక్రమాలు జరిగాయని తెలిస్తే స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయమే జోక్యం చేసుకొని సీఐడీ విచారణకు కూడా ఆదేశించి అక్రమార్కులకు చెక్ పెట్టింది.

అప్పులు తీర్చేదెట్లా?

అప్పోసొప్పో చేసి చికిత్స చేసుకున్న పేదలు.. డిశ్చార్జి అయ్యాక సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకొంటే రెండు నెలల్లోపే ఇంటికి చెక్కు వచ్చేది. ఆ డబ్బుతో తీసుకున్న అప్పులను తీర్చుకునేవారు. ఇప్పుడు సుమారు 80 వేల మంది సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకొన్నారు. అక్టోబర్‌లో ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. అంతకు రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నవారు కూడా ఉన్నారు. అంటే.. ఆరు నెలల క్రితానికి సంబంధించిన ఫైళ్లు కూడా సెక్రటేరియట్‌లోని సీఎంఆర్‌ఎఫ్ సెక్షన్‌లో ఉన్నాయి. 35 వేలకుపైగా చెక్కులు లబ్ధిదారుల పేర్లతో సిద్ధంగా ఉంటే మరో45 వేల దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించిన వెరిఫికేషన్ కూడా పూర్తయింది. వీటిపై కొత్త ప్రభుత్వం ఇంకా దృష్టిసారించ లేదు. ఇవి విడుదల అయితేనే, పేదవాళ్లు తమ అప్పులు కట్టుకుంటారు.

మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఎలా?

ఇప్పటికే జనవరి 18వ తేదీ వచ్చేసింది. మరో వారం పాటు సీఎం రేవంత్‌రెడ్డి అందుబాటులో ఉండరు. వచ్చాక బడ్జెట్ సమావేశాలతో బిజీ అవుతారు. ఆ సమయంలోనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నది. అంటే మరో నెలలోపు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలి.లేకపోతే మళ్లీ ఎన్నికల కోడ్ వచ్చి మే వరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వచ్చే అవకాశం ఉండదు. ఇది పేద వర్గాలకు తీవ్ర ఇబ్బంది కలిగించే అంశం.

ఆలస్యం ఎందుకు?

అనధికారిక సమాచారం మేరకు.. చెక్కుల పంపిణీ ఎలా చేయలన్నదానిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయానికి రాలేదని తెలిసింది. ఈసారి ప్రతిపక్షంలో కూడా ఎమ్మెల్యేల సంఖ్య భారీగానే ఉన్నది. ఒక వేళ వీటిని పంపిణీ చేస్తే ప్రతిపక్ష ఎమ్మెల్యేల ద్వారా ఇవ్వాల్సి వస్తుంది. మరి ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఇచ్చి పంపిణీ చేపడితే వాళ్లకు క్రెడిట్ వెళ్తుందని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఇక మరో కోణం ఏమిటంటే.. ఎన్నికలకు ముందు వచ్చినవాటిల్లో మెజార్టీ దరఖాస్తులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చినవే. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ పాత దరఖాస్తులను పరిష్కరిస్తే ఆనాడు ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకే క్రెడిట్ పోతుందన్న ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉన్నట్టు తెలిసింది. కేవలం రాజకీయ కారణంతోనే సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయినట్టు ప్రచారం జరుగుతున్నది.

యూరియా కొరతకు కారకులెవరు?

- వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ దోబూచులాట
- డీఏవోలు, డీఎంలు పరస్పర ఆరోపణలు
- నిల్వలున్నా.. సరఫరా చేయడంలో విఫలం
- జిల్లాల్లో వేధిస్తున్న కొరత.. రైతులు ఆగం

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): మొన్న నల్లగొండలో, నిన్న ఆదిలాబాద్‌లో, నేడు నిర్మల్‌లో ఇలా వరుసగా రోజుకోచోట యూరియా కొరత సమస్య తలెత్తుతున్నది. రైతులు యూరియా కోసం మళ్లీ క్యూ లైన్లలో నిల్చోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. యూరియా వినియోగం అత్యధికంగా ఉండే ఈ సమయంలో అవసరమైనన్ని నిల్వలను అందుబాటులో ఉంచడంలో ఇటు వ్యవసాయ శాఖ, అటు మార్క్‌ఫెడ్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే యూరియా కొరతపై క్షేత్రస్థాయిలో పరిస్థితులకు, అధికారులు చెప్పేదానికి పొంతన లేకుండా ఉంది. అధికారులు మాత్రం యూరియా కొరత అసలే లేదని, గతేడాది కన్నా సుమారు 2 లక్షల టన్నులు అధికంగా నిల్వలు ఉన్నాయని అంటున్నారు. అదే నిజమైతే... యూరియాను సకాలంలో రైతులకు చేరవేయడంలో వారే విఫలమవుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిల్వలు ఉన్నప్పటికీ సరఫరా లేదంటే ఇది కచ్చితంగా నిర్లక్ష్యమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఈ నిర్లక్ష్యానికి బాధ్యులు ఎవరనేది తేల్చాల్సి ఉంది. ఈ కృత్రిమ కొరతపై ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది.

కొరతకు 'సమ్మె' సాకు...

యూరియా కొరతను కప్పిపుచ్చుకొనేందుకు అధికారులు కుంటిసాకులు చెప్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో యూరియా కొరతకు లారీ డ్రైవర్ల సమ్మె కారణమని అధికారులు చెప్పారు. మూడు నాలుగు రోజులుగా లారీ డ్రైవర్ల సమ్మెతో ట్రాన్స్‌పోర్ట్ పూర్తిగా స్తంభించిందని, అందుకే యూరియాను సరఫరా చేయలేకపోయామని అన్నారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ సమ్మె కొనసాగి ఉంటే యూరియాతోపాటు ఇతర ఎరువుల సరఫరాను కూడా పూర్తిగా నిలిపేసేవారా అని ప్రశ్నిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని నిలదీస్తున్నారు. ఇప్పటికీ పలు జిల్లాల్లో యూరియా కొరత ఉండటం గమనార్హం. కొత్తగూడెం, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో యూరియా కొరత ఉన్నట్టు సమాచారం.

వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ సమన్వయ లోపం

ఎరువుల పంపిణీలో మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నది. జిల్లాల్లో జిల్లా వ్యవసాయ అధికారి అనుమతితో ప్రాథమిక సహకార సంఘాలకు మార్క్‌ఫెడ్ ద్వారానే ఎరువులు సరఫరా అవుతాయి. ఇక్కడే రెండు శాఖల మధ్య సమన్వయం కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖకు చెందిన డీఏవోలకు, మార్క్‌ఫెడ్‌కు చెందిన డీఎంలకు మధ్య పొసగడం లేదని, అందుకే యూరియా సరఫరాలలో ఇబ్బందులు తలెత్తుతున్నాయనే చర్చ జోరుగా సాగుతున్నది. డీఎంలు అడిగినంత స్టాక్‌కు డీఏవోలు అనుమతించడం లేదని తెలిసింది. నిర్మల్‌లో జరిగిన ఘటనలో అక్కడి డీఏవో, డీఎం మధ్య సమన్వయలోపమే యూరియా కొరతకు దారితీసిందనే వాదన వినిపిస్తున్నది. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తతంగం కొనసాగుతున్నదని అంటున్నారు. మార్క్‌ఫెడ్ నుంచి వచ్చే యూరియా స్టాక్‌ను పీఏసీఎస్‌లకు ఇచ్చేందుకు అనుమతి నిరాకరిస్తున్న డీఏవోలు... ప్రైవేటు కంపెనీలకు మాత్రం విచ్చలవిడిగా అనుమతులు జారీ చేస్తున్నారని డీఎంలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు విభాగాల మధ్య సమన్వయం లేకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చేతులెత్తేసిన రవాణా కాంట్రాక్టు సంస్థ

యూరియా కొరత ఏర్పడకుండా చూడాల్సిన రవాణా కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు జిల్లాలు మినహా రాష్ట్రమంతటా ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎరువుల నిర్వహణ, రవాణా కాంట్రాక్టును ఓ బడా సంస్థ దక్కించుకున్నది. ఈ సంస్థకు సొంతంగా లారీలు ఉన్నాయని, ఏ పరిస్థితుల్లో అయినా ఎరువులను రవాణా చేసే సామర్థ్యం ఉందంటూ గతంలో అధికారులు ఆ సంస్థను వెనకేసుకొచ్చారు. పదేండ్లుగా ఆ సంస్థకే కాంట్రాక్టును కట్టబెడుతున్నారు. ఇప్పుడు అవసరమైన సమయంలో ఆ సంస్థ చేతులెత్తేయడం గమనార్హం. డ్రైవర్ల సమ్మె జరిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన బాధ్యత సదరు సంస్థకు లేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. క్లిష్టమైన పరిస్థితుల్లో సేవలు అందించకుండా చేతులెత్తేయడం ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

యాసంగి సాగు... 34 లక్షల ఎకరాలు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సాగు జోరుగా సాగుతున్నది. ఇప్పటివరకు 34 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. గతేడాది ఇదే సమయానికి 32.72 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు పేర్కొంది. ఈ ఏడాది అత్యధికంగా వరి 23.36 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే 1.73 లక్షల ఎకరాల్లో అధికంగా వరి సాగు కావడం గమనార్హం. మక్కజొన్న 3.96 లక్షల ఎకరాల్లో, శనగ 2.48 లక్షల ఎకరాల్లో, వేరుశనగ 1.95 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి.

నిపుణ – విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్‌ఈసీ లిమిటెడ్‌లో..

మహారత్న కంపెనీ ఆర్‌ఈసీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 127
- పోస్టులు: డీజీఎం, మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, చీఫ్ మేనేజర్, జనరల్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 9
- వెబ్‌సైట్: www.recindia.nic.in

ఎన్‌ఏబీఎఫ్ఐడీలో..

నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఎఫ్ఐడీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 12
- పోస్టులు: సీనియర్ అనలిస్ట్
- విభాగాలు: హెచ్‌ఆర్, అడ్మినిస్ట్రేషన్, ఐటీ ఆపరేషన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, లీగల్, అకౌంట్స్, సీఎస్, ఎకనమిస్ట్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 2
- వెబ్‌సైట్: https://nabfid.org

ఆర్‌సీఎఫ్ఎల్‌లో..

రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: ఆఫీసర్ (మెడికల్), ఇంజినీర్
- దరఖాస్తు, చివరితేదీ, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- వెబ్‌సైట్: www.rcfltd.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జాగ్రఫీ, ఫిజిక్స్, ఎకానమీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

గవర్నర్ ఎక్స్ అకౌంట్ హ్యాక్

సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేశారు. హ్యాకింగ్‌పై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు బుధవారం రాజ్‌భవన్ వర్గాలు ఫిర్యాదు చేశాయి. ఏసీపీ చంద్‌పాషా నేతృత్వంలోని బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ @డాక్టర్ తమిళిసైగవ్ పేరుతో ఉన్న ఎక్స్ ఖాతా ఓపెన్ కాకపోవటంతో పాటు బ్లూ టిక్ పోయింది. హ్యాక్ అనుమానం రావటంతో, వెంటనే దర్యాప్తు చేపట్టాలని రాజ్‌భవన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్‌క్రైమ్ పోలీసులు హ్యాకింగ్ జరిగిందా? లేదా? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ కవిత సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్‌కు గురయ్యాయి. ఈ విషయాన్ని ఆమె ఎక్స్ ద్వారా తెలిపారు. డీజీపీ, సైబర్ సెక్యూరిటీ విభాగానికి ట్యాగ్ చేస్తూ.. సైబర్ నేరగాళ్లు మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు వరుసగా పలుమార్లు హ్యాకింగ్‌కు ప్రయత్నించారని వెల్లడించారు. తన ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలు హ్యాక్ అయ్యాయని, దుండగులు ఖాతాల్లోకి అనుమానాస్పదంగా లాగిన్ అయ్యారని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను పోస్టు చేశారని పేర్కొన్నారు.

సాగునీళ్లు వస్తాయా? రావా?

- గోదావరి జలాల కోసం ఎదురుచూపులు
- కాంగ్రెస్ నాయకులు, అధికారుల ప్రకటనతో అన్నదాతల అయోమయం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వంలో యాసంగి పంటల సాగుకు నీళ్లు వస్తాయా? రావా? అని రైతులు అనుమానిస్తున్నారని, నీటి విడుదలపై కాంగ్రెస్ నాయకులు, అధికారుల ప్రకటనతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నర్సంపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతులు గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నట్టు తెలిపారు. కేసీఆర్ సర్కార్ నియోజక వర్గంలో మూడు, నాలుగేండ్లుగా ఇరిగేషన్ సర్క్యూట్ ప్లాన్ ప్రకారం గోదావరి జలాలను తీసుకుని వచ్చి రెండు పంటలకు సమృద్ధిగా నీరందించిందని పేర్కొన్నారు. ప్రత్యేకమైన ఏజెన్సీ పెట్టుకుని సమగ్రమైన ప్రణాళిక ద్వారా పంటల సాగుకు గోదావరి జలాలను తీసుకుని వచ్చినట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సాగునీటిపై ఒక్కసారైనా అధికారులతో సమీక్షించారా? అని ప్రశ్నించారు. గతంలో పూడుకుపోయిన డీబీఎం 38,40,48వ కాల్వలను పునర్నిర్మించి, కాకతీయ కాలువపై క్రాస్ రెగ్యులేటరీ నిర్మాణం చేయించి సమృద్ధిగా నీరందించి పంటల సాగుకు కృషి చేసినట్టు తెలిపారు.

నిలకడగా తమ్మినేని ఆరోగ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, ప్రాథమికంగా అందిస్తున్న చికిత్సకు ఆయన స్పందిస్తున్నారని ఏఐజీ వైద్యులు బుధవారం వెల్లడించారు. ఈ నెల 16న అనారోగ్యంతో ఆయన ఏఐజీలో చేరిన విషయం తెలిసిందే. ప్రత్యేక వైద్యబృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని, మరో 24 నుంచి 48 గంటలు అత్యంత కీలకమని, అప్పటివరకు వైద్య బృందం నిరంతరం పర్యవేక్షించడంతో పాటు వెంటిలేషన్‌తో కూడిన చికిత్స అందించడం జరుగుతుందని వైద్యనిపులు ఆ బులెటిన్‌లో పేర్కొన్నారు.